క్లుప్తంగా

అథ్లెట్‌కు సన్మానం



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన అథ్లెట్ గుగ్గిలం అశోక్‌ను వేల్పూర్ వాకర్స్ గ్రూపు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మినీ స్టేడియంలో శాలువాతో సన్మానించారు. కామారెడ్డిలో ఆర్టీఏ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గుగ్గిలం అశోక్ అథ్లెట్‌గా రన్నింగ్‌లో ఏడెనిమిదేళ్లుగా రాణిస్తున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలలో ప్రతిభ కనబరుస్తూ చాలా పతకాలు సాధించాడు. దీంతో ఆయనని ఘనంగా సన్మానించారు. వాకర్స్ గ్రూపు సభ్యులు శ్రీనివాస్, మారుతి, రిటైర్డ్ టీచరు గంగాధర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, కానిస్టేబుల్ భాను, సంజీవ్, రవి, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ డ్రెస్సుల పంపిణీ



ఎడపల్లి(బోధన్): జాన్కంపేట్, నెహ్రూనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలతో పాటు హైస్కూల్‌లోని విద్యార్థులకు ఆదివారం స్కూల్ డ్రెస్సులను డీఆర్‌డీవో సాయాగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ స్కూల్‌లో చదివే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, స్కూల్ డ్రెస్సెస్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలన్నారు. వైస్ ఎంపీపీ ఇమ్రాన్, ఎంపీటీసీ సంజీవ్, ఏపీఎం సాయిలు, ఐకేపీ గ్రామ కో–ఆర్డినేటర్లు, హెడ్ మాస్టర్లు, టీచర్లు ఉన్నారు.

యూనిఫామ్స్ పరిశీలన



రుద్రూర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం మహిళ సంఘాల ఆధ్వర్యంలో తయారు చేస్తున్న యూనిఫాంలను డీఆర్‌డీవో సాయాగౌడ్ పరిశీలించారు. రుద్రూర్ ఐకేపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న స్కూల్ యూనిఫాంలను పరిశీలించారు. సిద్ధంగా ఉన్న దుస్తులను బాలికల హైస్కూల్, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు అందజేశారు. మండల విద్యాధికారి శాంతకుమారి, డీపీఎం రాచయ్య, ఐకేపీ ఏపీఎం భాస్కర్, సీసీలు నాగరాజు, స్వాతి, సీఆర్‌పీ అంబర్ సింగ్ తదితరులు ఉన్నారు.

నోటు పుస్తకాల వితరణ



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని మహతీ ఆశ్రమ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను ఆర్మూర్‌కు చెందిన పట్వారీ శ్రీనివాస్ అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. దాతను రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు గోపి కృష్ణ అభినందించారు. విద్యార్థుల కోసం దాతలు ఎప్పుడు ముందుండాలన్నారు. కార్యదర్శి తులి, కోశాధికారి లక్ష్మి నారాయణ, మాజీ అధ్యక్షుడు ప్రవీణ్, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమంలో కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొని శ్రమదానం చేశారు. కాలనీల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఉద్యానంలో ఉన్న వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని, రోడ్లను శుభ్రపర్చారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ మాట్లాడారు. 49 వారాలుగా ఉత్సాహంగా శ్రమదానం కొనసాగు తుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కమిటీ సభ్యులు సుంకే శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, కొక్కెర భూమన్న, కొంతం రాజు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అధ్వానంగా నిజాంసాగర్ కాలువ



- చెత్తాచెదారంతో నిండిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఆర్మూర్‌టౌన్: వానా కాలం సీజన్ వచ్చినప్పటికీ నిజాంసాగర్ కెనాల్ బాగు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి కాలువ నిర్వహణ అధ్వానంగా ఉంది. ఆర్మూర్ పట్టణంలో రోడ్డు వెంట ఉన్న నిజాంసాగర్ కాలువ చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోయింది. అలాగే వివిధ దుకాణదారులు చెత్తను కెనాల్‌లో వేసి మరింత అధ్వానంగా మారుస్తున్నారు. గుత్ప ఎత్తిపోతల ద్వారా నీరు వదిలినప్పుడు కెనాల్ చెత్తా చెదారంతో ఉండటంతో చెరువుల్లో నీరు కలుషితమైపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలాగే కాల్వలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు సంవత్సరాల క్రితం వడ్డెర కాలనీలో కొంత భాగం పూడిక పనులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. నిజాంసాగర్ కెనాల్ పూడిక పనులు చేపట్టాలని రైతులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అలాగే నిజాంసాగర్ కెనాల్‌ను ఆనుకొని పలువురు కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. ఈ విషయమై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ఫిర్యాదులు చేసినప్పటికి ఎటువంటి చలనం లేకపోవడంతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కెనాల్‌లో మటన్, చికెన్ షాపు యజమానులు మాంసం వ్యర్థాలు వేయడంతో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రహదారి వెంట వెళ్తున్న వాహనదారులు, పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పూడికను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పూడికను తొలగించాలి



నిజాంసాగర్ కెనాల్‌లో పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలను తొలగించాలి. చెత్తాచెదారం ఉండటంతో గుత్ప ఎత్తిపోతల ద్వారా నీరు విడుదలైనప్పుడు చెరువులో కలుషితమైన నీరు వచ్చి చేరుతుంది. అధికార యంత్రాంగం సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలి. – రాజు, రైతు, ఆర్మూర్

దుర్వాసన వస్తోంది



సాగర్ కెనాల్‌లో చెత్తాచెదారం ఉండటంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు దుర్వాసన వస్తోంది. అలాగే కలుషితమైన నీరు చెరువుల్లోకి వెళ్లడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మురికినీరు రాకుండా చర్యలు తీసుకోవాలి. – గంగూలీ, స్థానికుడు, ఆర్మూర్

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి



బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బోధన్‌టౌన్(బోధన్): ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించకుండా, ప్రభుత్వ పాఠశాల్లో తమ పిల్లలను చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని రాకాసీపేట్ ప్రాంతంలోని గాంధీనగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల(జీసీ) ఉపాధ్యాయులు బడి బాట నిర్వహించారు. కాలనీలోని ఇంటింటికి తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజన సౌకర్యం, స్కూల్ డ్రెస్‌తో పాటు విద్యార్థులకు ఉపకార వేతనం వంటి సౌకర్యాలను కల్పించిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించి ప్రభుత్వం అందించే వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు రాచప్ప, వసీం, సుల్తానాలు ఉన్నారు.



అక్లూర్‌లో బడిబాట నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు,



సాహెబ్‌పేట్‌లో..

అంగన్‌వాడి టీచర్ల బడిబాట

వేల్పూర్: అక్లూర్, సాహెబ్‌పేట్ గ్రామాలలో ఆదివారం అంగన్‌వాడి టీచర్లు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. చిన్న పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం బలమైన ఆహారం అందజేస్తోందన్నారు. వారి వయస్సుకు తగ్గ ఆటపాటలు అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తామని, దాంతో వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. మూడేళ్ల పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపడం వల్ల వారు ఒత్తిడికి గురవుతారని చెప్పారు.

ఇష్టపడి చదవాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు ఇష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని రిటైర్డు కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ చౌల్ రాజేశ్వర్ అన్నారు. పెర్కిట్‌లో ఆదివారం జిల్లా దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పదో తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి రాజేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమ శిక్షణ అలవరుచుకుని సమయపాలనతో చదవాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఏసీటీవో లిక్కి భూమేశ్వ, స్థానిక కౌన్సిలర్ లిక్కి శంకర్, దేవాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గి లక్ష్మణ్, దేవాంగ విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులోనూ పెద్ద చేపలు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోనే పెద్ద పెద్ద చేపలు ఉంటాయనుకుంటే పొరపాటే. బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లోని చెరువులో కూడ పెద్ద పెద్ద చేపలు చిక్కుతున్నాయి. జలాల్‌పూర్ చెరువులోకి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ కలుస్తుంది. దీంతో చెరువులో కూడ పెద్ద పెద్ద చేపలు లభిస్తున్నాయి. ఆదివారం చెరువులో చేపల వేటాడుతుండగా స్థానిక మత్స్యకారుడు బింగి శ్రీనివాస్‌కు 15 కేజీల చేప చిక్కింది. చెరువులో కూడా పెద్ద చేపలు దొరుకుతుండడంపై మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్మూర్ క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లక్ష్మీ నారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు బచ్చేవాల్‌రెడ్డి ప్రకాష్, కార్యదర్శి బారడ్ గంగా మోహన్ ఆధ్వర్యంలో నూతన పంచ్ కమిటీ సభ్యులు, కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షుడిగా బాదాం రాజ్ కుమార్, హజారి సతీష్, సంయుక్త కార్యదర్శులుగా హజారి రమేష్, షికారి శ్రీనివాస్, సంతని విజయ్, బారడ్ కిషోర్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, సభ్యులు గట్టడి సత్యనారాయణ, సాత్‌పుతే శ్రీనివాస్, బొబిడే గంగా కిషన్, కర్తన్ శ్రీనివాస్, పాన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

రుద్రూర్: ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశారు.

పోతంగల్ (రుద్రూర్): మండల కేంద్రంలో ఆదివారం శ్రీకర్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బెల్లం రాజు, సుధీర్ మహేందర్, గంగాధర్ బస్వంత్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చితే చూస్తూ ఊరుకోం'



ఆర్మూర్: రాజ్యాంగాన్ని మారుస్తానని బీజేపీ చేస్తున్న ప్రకటన తక్షణమే మానుకోకపోతే దళితుల సహనాన్ని పరీక్షించడమే అవుతుందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నేత తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మిలన్ ఫంక్షన్ హాల్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ.. గ్రామాల్లో అభివృద్ధికి మాత్రమే పాటుపడాల్సిన గ్రామాభివృద్ధి కమిటీలు ఇష్టానుసారంగా కుల బహిష్కరణలు విధించడాన్ని అధికార యంత్రాంగం నియంత్రించాలన్నారు. అంతకు ముందు జిల్లా నాయకులు కంజార భూమన్న, రాజన్న మాదరి నరేష్ మాట్లాడుతూ.. దళితులపై దాడులకు తెగబడుతున్న బీజేపీని ఎదిరించేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యాదగిరిగుట్టలో ఈ నెల 18న నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. నేతలు ముత్యాలు, లక్ష్మినర్సయ్య, ముప్పారపు రాజశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం నిరీక్షణ



డొంకేశ్వర్(ఆర్మూర్): రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డొంకేశ్వర్ మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ పంపిణీ ఆలస్యంగా జరుగుతోంది. డీలర్లు తమకు నచ్చిన సమయానికి వచ్చి దుకాణాలను తెరుస్తున్నారు. దీంతో బియ్యం కోసం ఎదురుచూసిన లబ్ధిదారులు దుకాణాల వద్ద క్యూ కడుతున్నారు. వెంట తెచ్చుకున్న సంచులను వరుస క్రమంలో పెట్టి గంటల కొద్దీ వేచి చూస్తున్నారు. మండలంలో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రేషన్ దుకాణాల నిర్వహణ గాడి తప్పుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పైపులైన్‌లకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా చేపడుతున్న కల్వర్టుల తవ్వకాల్లో మిషన్ భగీరథ పైపులు పగిలిపోవడంతో గ్రామంలో పలు కాలనీలకు నీటి సరఫరా ఆగిపోయింది. ఈ కారణంగా తాగు నీటి సమస్య తలెత్తడంపై సాక్షి దిన పత్రికలో 'దూదిగాంలో తాగు నీటి సమస్య' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. స్పందించిన మిషన్ భగీరథ అధికారులు ఆదివారం పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టారు. తాగునీటికి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ డిప్యూటీఈఈ అనిల్‌కుమార్ అన్నారు. పనులు పూర్తి చేసి సోమవారం నుంచి నీటిని అందిస్తామన్నారు.

తొలగిన ముసుగు

సాక్షి ఎఫెక్ట్..



ముసుగు తొలగించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం

ఆర్మూర్‌టౌన్: ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ పట్టణంలో విగ్రహాలకు తొడిగిన ముసుగులు తొలగలేదు. ఈ విషయమై సాక్షిలో తొలగని ముసుగులు అనే శీర్షికతో వార్త ఇవ్వడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆదివారం వివిధ పార్టీ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించారు.

కల్వర్టు నిర్మించండి



తాత్కాలికంగా పైపులపై వేసిన రోడ్డు

వేల్పూర్: వేల్పూర్ నుంచి రామన్నపేట్ రహదారి మధ్యలో తెగిపోయిన చోట కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత ఏడాది జూలై 24న కురిసిన వర్షానికి మోతె చెరువు నుంచి వచ్చిన వరద నీటికి ఈ రోడ్డుకు భారీగా గండిపడి తెగిపోయింది. ఆ రోజు కురిసిన వర్షానికి వేల్పూర్, పడగల్, జాన్కంపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల చెరువులు సైతం తెగిపోయాయి. రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెగిపోయిన చెరువు కట్టలకు, రహదారులకు మరమ్మతులు చేయించారు. అందులో భాగంగా రామన్నపేట్ రహదారికి తాత్కాలికంగా పైపులు వేయించి రాకపోకలు పునరుద్ధరింపజేశారు. మోతె పెద్దచెరువు అలుగునీరు, పొలాల నుంచి వచ్చే వరదనీరు రామన్నపేట్ రహదారి దాటి వేల్పూర్ వాగులో కలుస్తుంది. ఈ ఏడాది కూడా భారీగా వర్షం కురిసి గత ఏడాది వచ్చిన మాదిరిగా వరద వస్తే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శాశ్వత పరిష్కారంగా కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



గంగా జలాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



పూజలు చేస్తున్న పురోహితులు

బాల్కొండ: మండల కేంద్రంలో గ్రామ దేవతలకు ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో జలాభిషేకం నిర్వహించారు. ముందుగా పవిత్ర గోదావరికి కాలి నడకన వెళ్లి గంగా జలాలను తీసుకువచ్చారు. అనంతం వల గొడుగును డప్పు వాయిద్యాలతో గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా బాలాజీ వార్షికోత్సవం

రుద్రూర్: పొతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ మందిరం 19వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి గౌరి పూజ, గో పుణ్యహవచనం, కుంకుమార్చన, భజన, పల్లకి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాం మందిర్ గజానన్ మహరాజ్ వెంకటేశ్వర వైభవం గురించి వివరించారు. పురోహితులు హన్మంత్ రావ్ జోషి, శ్రీనివాస్ జోషి, సుధీర్ త్రిపాఠి ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. 2 రోజుల పాటు నిర్వహించే వార్షికోత్సవానికి హంపి విద్యారణ్య స్వామి హాజరవుతారని కమిటీ సభ్యులు వెల్లడించారు.



ధ్యాన బంధువుల శాకాహార ర్యాలీ

నందిపేట్(ఆర్మూర్): వెల్మల్ గ్రామంలో ధ్యాన బంధువుల ఆధ్వర్యంలో ఆదివారం అహింసాయుత మహా కరుణ శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధ్యానాత్మ జ్ఞానదాత మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్టు సభ్యులు శ్రీలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పిరమిడ్ మెడిటేషన్ ఛానల్ చూడాలని, ధ్యానం చేసి ఆత్మజ్ఞానాన్ని పొందాలన్నారు. ధాన్యం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని వివరిస్తూ ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, సిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ తిరుమల గంగారాం, మామిడి లక్ష్మారెడ్డి, అమరవాజీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	లవ్‌బాయ్స్ (తెలుగు) – 11.05, వెపన్ (తెలుగు) – 1.50, భజే వాయువేగం – 4.30, లవ్‌మౌళి (తెలుగు) – 7.25, రక్షణ – 10.30
స్క్రీన్-3 –	మనమే (తెలుగు) – 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	సత్యభామ – 10.50, 4.50, 10.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి – 1.45, బ్యాడ్‌బాయ్స్ – 7.45